దినదిన గండం

- హైవే క్రాసింగ్‌లపై ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకోవాల్సిందే!
- నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా.. పట్టించుకోని అధికారులు
- ఫ్లై ఓవర్లు నిర్మిస్తేనే సాఫీ ప్రయాణం

హైవే క్రాసింగ్‌లు ప్రజలకు దినదిన గండంగా మారింది. ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని దాటాల్సి వస్తోంది. ఇలాంటి క్రాసింగ్‌ల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఎంతో మంది ప్రాణాలు ఇప్పటికే గాల్లో కలిసిపోయాయి. హైవేపై అవశ్యమైన చోట ఫ్లైఓవర్‌లు నిర్మించకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొన్నా.. హైవే అధికారుల్లో చలనం లేకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.



టపాతోపు క్రాసింగ్ వద్ద బిక్కుబిక్కుమంటూ రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనదారుడు

కొడవలూరు : మండల పరిధిలో 25 కిలోమీటర్ల హైవే విస్తరించి ఉంది. ఈ పరిధిలో ఆరు ఫ్లైఓవర్‌లు నిర్మించి ఉన్నారు. కానీ అత్యవసరమైన చోట నిర్మించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. మండలంలోని చంద్రశేఖరపురం, టపాతోపు, రామన్నపాళెంల వద్ద క్రాసింగ్‌లు ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారాయి. ఈ మూడు క్రాసింగ్‌లలో నెలకొకరైనా ప్రాణాలు పోగొట్టుకొంటూనే ఉన్నారు.

ప్రాణసంకటంగా టపాతోపు క్రాసింగ్

టపాతోపు హైవే క్రాసింగ్ ఎంతో ప్రత్యేకత కలిగింది. అనేక గ్రామాలకు కూడలి ప్రాంతమైన నార్తురాజుపాళేనికి వెళ్లాలన్నా, కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాలకు వెళ్లాలన్నా ఈ క్రాసింగ్ ద్వారానే పదుల సంఖ్యలో కార్లు, ద్విచక్ర వాహనాలు దాటుతుంటాయి. ఇలాంటి సమయంలో హైవేపై వేగంగా వచ్చే కార్లు వాహనదారులను ఢీకొంటున్నాయి. కనీసం నెలలో ఒకట్రెండు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో తీవ్రంగా గాయపడుతుంటే.. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు పోతున్నాయి. అయినా ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మించకపోవడం గమనార్హం.

ప్రమాదాల క్రాసింగ్

రామన్నపాళెం వద్దున్న హైవే క్రాసింగ్‌కు కూడా ఎంతో ప్రాధాన్యం ఉంది. దీని నుంచి తూర్పు వైపునకు వెళ్లే రోడ్డు అనేక గ్రామాలకు మార్గం. మండలంలోని రామన్నపాళెం, మానేగుంటపాడు, ఆలూరుపాడు, రెడ్డిపాళెం గ్రామాలకు ఇదొక్కటే మార్గం కావడంతో పాటు విడవలూరు మండలం పార్లపల్లితో పాటు అటువైపు అనేక గ్రామాలకు ఈ రోడ్డు దగ్గరి మార్గం. అందువల్ల ఇక్కడి క్రాసింగ్‌కు ఎంతో ప్రాధాన్యముంది. ఒకవేళ నెల్లూరు వైపు నుంచి వచ్చే వారు రామన్నపాళెం క్రాసింగ్ వద్దని భావిస్తే రెండు కిలోమీటర్ల దూరంలోని బ్రహ్మయ్య కళాశాల వద్దున్న ఫ్లైఓవర్ నుంచి రావాలి. అందుకు అదనంగా నాలుగు కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంది. అందువల్ల



ప్రమాదకరంగా రామన్నపాళెం క్రాసింగ్

విధిలేని పరిస్థితుల్లో ఈ క్రాసింగ్‌నే ఆశ్రయించి ప్రాణాల మీదకు తెచ్చుకొంటున్నారు. ఈ నెలలోనే ఈ-క్రాసింగ్ భూతానికి టపాతోపునకు చెందిన ఓ దివ్యాంగుడు మృతి చెందారు. ఇవన్నీ హైవే అధికారులకు తెలిసినా ప్రజల ప్రాణాలే కదా అన్నట్లు మిన్నకుండిపోతున్నారన్న విమర్శలున్నాయి.

మృతదేహంతో నిరసన తెలిపినా పట్టించుకోలేదు



చంద్రశేఖరపురం క్రాసింగ్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో ఫ్లైఓవర్ నిర్మించాలని హైవే అధికారులను అనేక పర్యాయాలు కోరాం. క్రాసింగ్ వద్ద రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన మృతదేహంతో గ్రామస్తులంతా నిరసన తెలిపాం. ఆ సమయంలో కలెక్టర్ వచ్చి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ అమలు కాలేదు. ఇక్కడ ప్రమాదాలు తగ్గాలంటే ఫ్లైఓవర్ నిర్మించడం తప్ప మరో మార్గం లేదు.

– తలతోటి ప్రసన్నకుమార్, చంద్రశేఖరపురం, కొడవలూరు మండలం

అండర్‌పాస్ నిర్మించినా ఊరటే



రామన్నపాళెం క్రాసింగ్ వద్ద జరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా కనీసం అండర్ పాసైనా నిర్మించాలని బాధిత గ్రామాల వారంతా హైవే ఉన్నతాధికారులను కోరాం. ఆందోళనలు కూడా చేపట్టాం. ఆ సమయంలో అండర్ పాస్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. తరువాత పట్టించుకోలేదు.

– నీలకంఠం శ్రీధర్‌రెడ్డి, రెడ్డిపాళెం, కొడవలూరు మండలం

ప్రజల ప్రాణాలంటే లెక్కలేదు



టపాతోపు క్రాసింగ్ ప్రమాదాలకు నెలవుగా మారింది. నిత్యం రద్దీగా ఉండే క్రాసింగ్ వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలని కోరితే పూర్తిగా క్రాసింగ్‌ను మూసి వేస్తామంటున్నారు. అలా చేస్తే కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాలకు వెళ్లే వారు చాలా దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. పైగా కొడవలూరు రైల్వే గేటు దాటాల్సి ఉంటుంది. ఇదీ ప్రమాదకరమే. ప్రజల ప్రాణాలంటే వారికి లెక్కలేదు.

– జి.జనార్థన్‌రెడ్డి, నార్తురాజుపాళెం, కొడవలూరు మండలం

అధిక ప్రాధాన్యమున్నా.. పట్టించుకోరు

చంద్రశేఖరపురం రోడ్డు క్రాసింగ్ నుంచి పడమర వైపున పెయ్యలపాళెం గ్రామం ఉంది. ఇక్కడి నుంచి అనేక గ్రామాలకు లింకు రోడ్ల సదుపాయం ఉంది. వీటి మీదుగా మండలంలోని గండవరం, సంగాయపాళెంల మీదుగా బుచ్చిరెడ్డిపాళెం వరకు దగ్గరి మార్గంలో వెళ్లవచ్చు. అదేవిధంగా పెయ్యలపాళెం నుంచి ఉత్తరం వైపునున్న లింకు రోడ్డులో దగదర్తి మండలానికి వెళ్లవచ్చు. అంతేకాకుండా చంద్రశేఖరపురంలో ఏపీఐఐసీ వారు ఇండస్ట్రీయల్ పార్క్‌ను ఏర్పాటు చేశారు. అందులో ఇప్పటికే జీడి పప్పు ప్రాసెసింగ్ ప్లాంట్ నడుస్తుండగా, మిథానీ పరిశ్రమ రానుంది. అదేవిధంగా ఇక్కడ క్రబ్స్ బయో కెమికల్ ఫ్యాక్టరీ, పెయ్యలపాళెం వద్ద అల్ఫా రొయ్యల పరిశ్రమ, రెండు తవుడు ఫ్యాక్టరీలు, ఏకలవ్య గురుకుల పాఠశాల, కళాశాల ఉన్నాయి. అందువల్ల పెయ్యలపాళెం రోడ్డుకు ఎంతో ప్రాధాన్యం ఉంది. నిత్యం పెద్ద వాహనాలతో పాటు ద్విచక్ర వాహనదారులు ఈ క్రాసింగ్ నుంచే వెళ్తుంటారు. ఇలా దాటే సమయంలో హైవేపై వేగంగా వెళ్లే వాహనాలు వారిని ఢీకొడుతున్నాయి. గత నెలలో తవుడు ఫ్యాక్టరీ యజమానుల కారును ఢీకొట్టగా భార్యాభర్తలు తీవ్రంగా గాయపడి ఇప్పటికీ ఆస్పత్రిలోనే ఉన్నారు. ఇక్కడ అప్పటికే ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మాణం చేయాలని చంద్రశేఖరపురం వాసులు పెద్ద ఎత్తున ఆందోళనలు కూడా చేశారు. శవాన్ని రోడ్డుకడ్డంగా పెట్టి నిరసన తెలిపారు. ఆ సమయంలో హైవేపై అర్ధరాత్రి వరకు ట్రాఫిక్ స్తంభించింది. అయినప్పటికీ హైవే అధికారులు పట్టించుకోలేదు.



చంద్రశేఖరపురం క్రాసింగ్ వద్ద ప్రమాదభరితంగా దాటుతున్న బైక్‌లు

క్లుప్తంగా

దారి చూపాలంటూ ఆందోళన



సమస్యలను వివరిస్తున్న కాలనీ వాసులు

మనుబోలు : మనుబోలు పోలీస్‌స్టేషన్ వెనుక వైపు ఉన్న జగనన్న కాలనీకి దారి చూపాలంటూ కాలనీ వాసులు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేశారు. అనంతరం ఎంపీడీఓ జలజాక్షిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉన్న దారి ప్రైవేటు స్థలం నుంచి ఉండడంతో ప్రస్తుతం దానిని వారు మూసివేశారని తెలిపారు. దీంతో కాలనీకి వెళ్లేందుకు దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అలాగే కాలనీలో హ్యాండ్ బోర్ లేకపోవడంతో నీటికి ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీనికి ఎంపీడీఓ స్పందించి కాలనీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వెదజల్లే పద్ధతితో రైతులకు ఆదా

- ఆత్మ పీడీ శివన్నారాయణ



వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తున్న వరిని పరిశీలిస్తున్న అధికారులు

కొడవలూరు : వెదజల్లే పద్ధతితో సాగు చేసే రైతులకు ఖర్చులు ఆదా అవుతాయని ఆత్మ పీడీ శివన్నారాయణ తెలిపారు. మండలంలోని రామన్నపాళెంలో వెదజల్లే పద్ధతితో సాగు చేస్తున్న చీపినాపి రవీంద్ర వరి పొలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తున్న వరి పైరు ఎంతో ఆరోగ్యకరంగా ఉందన్నారు. నాటిన పద్ధతితో పోల్చితే వెదజల్లే పద్ధతితో ఖర్చు బాగా తగ్గుతుందన్నారు. దీని వల్ల దిగుబడి ఆశాజనకంగా ఉంటుందన్నారు. ఇఫ్కో మేనేజర్ లక్ష్మీనారాయణ నానో డీఏపీ ఆవశ్యకతను తెలియజేశారు. పీడీ వెంట ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ ఉన్నారు.

న్యూ ఇయర్ వేడుకల్లో ఇరువర్గాల ఘర్షణ



రోడ్డుపై బైఠాయించిన పెనుబల్లికి చెందిన ఓ వర్గం

బుచ్చిరెడ్డిపాళెం: నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లి గ్రామంలో రెండు వర్గాలు ఘర్షణకు దిగాయి. ఓ వర్గం వారు మంగళవారం రాత్రి రోడ్డుపై కేక్ కట్ చేస్తున్న సమయంలో అదే ప్రాంతానికి చెందిన మరో వర్గం వారు అభ్యంతరం తెలిపినట్లు తెలిసింది. దీంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా ప్రత్యర్థి వర్గానికి చెందిన ఓ యువకుడు గాయపడినట్లు చెబుతున్నారు. అతడిని పరామర్శించేందుకు గురువారం బంధువైన వేగూరు వెంకయ్య అనే వ్యక్తి పెనుబల్లికి రాగా స్థానికంగా మరో వర్గానికి చెందిన యువకులు దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఓ వర్గం వారు రోడ్డుపై బైఠాయించారు. గ్రామానికి వెళ్లి సర్దుబాటు చేసి వారిని స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు ఎస్సై సంతోష్‌రెడ్డి తెలిపారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించండి



శిక్షణా కార్యక్రమంలో అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం : పాఠశాలల సమగ్రాభివృద్ధికి యాజమాన్య కమిటీలు చురుకైన పాత్ర పోషించి సహకరించాలని కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి పెంచలయ్య అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని డీఎల్ఎన్నార్ ఉన్నత పాఠశాలలో గురువారం హెచ్ఎంలు, యాజమాన్య కమిటీ సభ్యులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి బయట పిల్లలు లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి నమోదు చేయాలన్నారు. శిక్షణా కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా కె.హజరత్ బాబు, పి.సురేంద్రయ్య, పీవీకే ప్రసాద్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎం.దిలీప్‌కుమార్, పీవీ రత్నం, జిల్లా రిసోర్స్ గ్రూపు సభ్యుడు గండికోట సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో దుకాణాలకు వేలంపాటలు

కొడవలూరు : మండలంలోని గండవరంలో కొలువైన గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరిలో జరగనున్నాయి. దీనికి సంబంధించి దుకాణాల ఏర్పాటు, కొబ్బరికాయల అమ్మకం తదితరాలకు ఆలయ ప్రాంగణంలో గురువారం వేలం పాటలు నిర్వహించారు. కొబ్బరికాయల అమ్మకం రూ.1.75 లక్షలు, కొబ్బరి చిప్పలు రూ.27 వేలు, రంగుల రాట్నం రూ.6.32 లక్షలు, ప్రసాదాల అమ్మకం రూ.51 వేలు, శాశ్వత పూజా సామగ్రి అమ్మకం రూ.51 వేల వంతున వేలం పాటలో దక్కించుకున్నారు. తాత్కాలిక దుకాణాలు, చెప్పుల స్టాండ్‌ల వేలం వాయిదా పడింది. ఈ వేలం ప్రక్రియలో ఆలయ ఈఓ బండి శాంతయ్య, ప్రధాన అర్చకుడు బండారు సుబ్రహ్మణ్యం, ఉప సర్పంచ్ ఆలం మాలకొండయ్య, స్థానిక నాయకుడు బచ్చు సురేష్ పాల్గొన్నారు.

ఎంఈఓ కార్యాలయంలో వేడుకలు



కొడవలూరు : స్థానిక ఎంఈఓ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఎంఈఓలు వసంతకుమారి, అంకయ్యలను సన్మానించారు. సీఆర్ఎంటీలు ఎం.దయాకర్, జె.పెంచలరావు, శ్రీహరి, లీలయ్య, కార్యాలయ సిబ్బంది విజయమ్మ, మస్తాన్ పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజను తన కార్యాలయంలో పలువురు అధికారులు గురువారం కలిసి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బుచ్చి పొదుపు సంఘాల సీఈఓ నర్మద, ఐబీ అంకయ్యతో పాటు పొదుపు సంఘాల ఆర్పీలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

కాకాణిని కలిసిన కోడూరు నేతలు

తోటపల్లిగూడూరు : మండలంలోని కోడూరు మేజర్ పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు గురువారం మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ నాయకుడు కావల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో గజమాలతో కాకాణిని సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, నాయకులు గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి, శేషు, దుర్గా తదితరులు పాల్గొన్నారు.



కాకాణికి గజమాలతో సత్కారం

అధ్యాపకురాలికి పరామర్శ

వెంకటాచలం : రోడ్డు ప్రమాదంలో గాయపడి నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డీఆర్‌డబ్ల్యూ కళాశాల అధ్యాపకురాలు పుష్పాంజలిని వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయ భాస్కరరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత గురువారం పరామర్శించారు. ఆమె ఇటీవల డిగ్రీ పరీక్షల మూల్యాంకనానికి వచ్చి, తిరిగి వెళ్లే సమయంలో రోడ్డు ప్రమాదంలో గాయపడింది. ఈ విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి వీసీ ఆస్పత్రికి వెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. వీఎస్‌యూ అధ్యాపకులు, పరీక్ష విభాగం సిబ్బంది, ఎన్ఎస్ఎస్ సిబ్బంది, వలంటీర్ల ద్వారా సేకరించిన రూ.55 వేల నగదును పుష్పాంజలి వైద్య ఖర్చుల నిమిత్తం ఆమె కుటుంబ సభ్యులకు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.



పుష్పాంజలి కుటుంబ సభ్యులకు నగదును అందజేస్తున్న ఇన్‌చార్జి వీసీ

ఆర్థిక నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పొదలకూరు : కొత్త మార్గాల్లో జరుగుతున్న ఆర్థిక నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పొదలకూరు వెలుగు ఏపీఎం చిన్నయ్య పేర్కొన్నారు. మండలంలోని మరుపూరు గ్రామంలో ట్రీస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, పొదుపు, సైబర్ నేరాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుర్తింపు పొందిన సంస్థల వద్దనే రుణాలు తీసుకోవాలని సూచించారు. లోన్ యాప్‌ల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. సదస్సులో కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, ట్రీస్ గౌరవాధ్యక్షుడు షేక్.నౌరాజ్, కార్యదర్శి షేక్.అహ్మద్, రిసోర్స్ పర్సన్ ఎ.చంద్రశేఖర్, వీఓఏ లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్రనామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భక్తుల భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.



మనుబోలులో..

- **మనుబోలు :** మండలంలోని మనుబోలు, జట్లకొండూరు గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లో అర్చకులు గురువారం విశేష పూజలు జరిపించారు. అర్చకులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ సాయిబాబా విగ్రహానికి అభిషేకాలు చేసి పుష్పాలంకరణ గావించారు. మనుబోలులో ముంగర రవీంధర్‌రెడ్డి, లలితమ్మ దంపతులు, వారి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



కొడవలూరు : స్థానిక విద్యా వనరుల కేంద్రం వద్ద యూటీఎఫ్(ఐక్య ఉపాధ్యాయ సంఘం) మండల శాఖ ఆధ్వర్యంలో సంఘ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌లను గురువారం ఆవిష్కరించారు. వీటిని ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎస్.అంకయ్యల చేతుల మీదుగా విడుదల చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.పుట్టయ్య, పి.తిరుపాలు, జిల్లా కార్యదర్శులు ఆర్.శైలజ, ఎస్కే.ఖాజావలీ, సంఘ నాయకులు ఎస్కే జమీర్‌అహ్మద్, సి.మోహన్‌రావు, టి.వెంకటేశ్వర్లు, ఎ.కీర్తన, ఎస్కే.గౌస్‌బాషా, సీహెచ్.శ్రీహరి పాల్గొన్నారు.


అమ్మవారిపాళెం విద్యార్థి ప్రతిభ



పెంచలకిశోర్‌తో ఉపాధ్యాయులు

పొదలకూరు : కౌశల్ రాష్ట్రస్థాయి సైన్స్ పోటీల్లో మండలంలోని అమ్మవారిపాళెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి నాగినేని పెంచలకిశోర్ ద్వితీయ స్థానం సాధించాడు. గతనెల 30న భారతీయ విజ్ఞాన మండలి ఆధ్వర్యంలో విజయవాడలో పోటీలు నిర్వహించారు. మొత్తం 312 మంది విద్యార్థులు పాల్గొనగా, పెంచలకిశోర్ ద్వితీయ స్థానాన్ని దక్కించుకుని జ్ఞాపిక, ప్రశంసాపత్రం, రూ.12 వేల నగదు అందుకున్నాడు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. ఇన్‌చార్జి హెచ్ఎం ఆర్.శ్రీహరిరెడ్డి, కో-ఆర్డినేటర్ జి.సురేంద్రకుమార్, ఉపాధ్యాయులు విజయభాస్కర్, ఎల్.వెంకటరెడ్డి, నాగశంకర్, రామరాఘవయ్య, ఖాజారంతుల్లా, సుభాషిణి, పద్మా, గౌస్ పాల్గొన్నారు.

ముగిసిన టెక్ సదస్సు



కోవూరు : గంగవరంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో టెక్‌సాక్షం ప్రోగ్రామ్ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ జి.సుబ్బారావు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.సందీప్‌కుమార్ మాట్లాడుతూ ఇండస్ట్రీ రెవల్యూషన్ 4.0కు సంబంధించిన ప్రాథమిక పరిజ్ఞానం, కృత్రిమ మేధస్సు, డేటా అనలిటిక్స్ వంటి సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా అంకిత్ దీక్షిత్, మేధిని వ్యవహరించారు.

రెవెన్యూ సదస్సులో వినతుల స్వీకరణ



కొడవలూరు: వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ స్ఫూర్తి

కొడవలూరు : మండల కేంద్రమైన కొడవలూరులో తహసీల్దార్ కె.స్ఫూర్తి ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించి వినతులు స్వీకరించారు. ఇతర శాఖలకు సంబంధించి వచ్చిన వినతులను ఆయా అధికారులకు పంపి పరిష్కరించాలని సిఫార్సు చేస్తామని తహసీల్దార్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీలత, ఆర్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.



ముత్తుకూరు : నారికేళపల్లిలో..

18 అర్జీల స్వీకరణ

ముత్తుకూరు : మండలంలోని నారికేళపల్లిలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో అధికారులకు 18 అర్జీలు వచ్చాయి. పట్టాదారు పాసు పుస్తకాల కోసం, భూముల సర్వే కోసం అర్జీలు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ వెల్లడించారు. రీసర్వే డీటీ శ్రీనివాసులు, సర్వేయర్ అనురూప్, వీఆర్వో, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వరికి నానో యూరియా వాడాలి

ముత్తుకూరు : రబీ సీజన్‌లో వరి పైరుకు ఒక్కసారైనా నానో యూరియా, నానో డీఏపీ వాడాలని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ సూచించారు. మండలంలోని పొట్టెంపాడులో గురువారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. రైతులు అధిక మోతాదులో యూరియాను కొనుగోలు చేసి, ఇళ్లల్లో భద్రపరుచుకుంటున్నారని, దీనివల్ల యూరియా కొరత ఏర్పడుతోందన్నారు. అధిక యూరియాను వినియోగిస్తే భూమి, నీరు, వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని హెచ్చరించారు. దీనివల్ల పంటలకు తెగుళ్లు సోకడమే కాకుండా ఖర్చు కూడా పెరిగిపోతుందన్నారు. మండల ఏఓ జోత్స్నరాణి, వీఏఏ శ్రీకాంత్ పాల్గొన్నారు.

- **కొడవలూరు :** వరిలో యాజమాన్య పద్ధతులు విధిగా పాటించాలని, శాస్త్రవేత్తలు సూచించిన విధంగానే ఎరువులను వినియోగించాలని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని కమ్మపాళెం, రేగడిచెలికల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఇబ్బడిముబ్బడిగా ఎరువులను వినియోగించడం వల్ల అనర్థాలు చోటుచేసుకొంటున్నాయన్నారు. సర్పంచ్ నల్లావుల శ్రీనివాసులు, వీఏఏలు సుజిత్, నవీన్ పాల్గొన్నారు.



ముత్తుకూరు : మాట్లాడుతున్న ఏడీఏ రాజ్‌కుమార్

- **కోవూరు :** వరిసాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీఏ సుజాత, ఏఓ ఇందిరావతి కోరారు. మండలంలోని ఇనమడుగు, పడుగుపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు సూచనలు చేశారు. ఉద్యానాధికారి ప్రసూన, సహాయకులు శ్వేతలేఖ పాల్గొన్నారు.

సమస్యలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న సర్పంచ్ పద్మమ్మ

మనుబోలు : గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని సర్పంచ్ కంచి పద్మమ్మ అన్నారు. మనుబోలు పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా తదితర సమస్యలపై దృష్టి సారిస్తామని తెలిపారు. గ్రామంలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా వెంటనే తనకు లేదా పంచాయతీ కార్యదర్శి దృష్టికి తేవాలని సూచించారు. ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఉప సర్పంచ్ కడివేటి చంద్రశేఖర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గరుడయ్య పాల్గొన్నారు.



కోవూరు : పడుగుపాడులో..

గ్రామాభివృద్ధికి సహకరించండి

కోవూరు : ప్రతిఒక్కరూ గ్రామాభివృద్ధికి సహకరించాలని జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత కోరారు. మండలంలోని పడుగుపాడు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎప్పటికప్పుడు గ్రామ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ రమణయ్య, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఈఓ హజరత్ బాబు, ఎంపీటీసీ సభ్యురాలు పర్వీన్ పాల్గొన్నారు.